సాక్షి ప్రకాశం
మంగళవారం । 16 । జూలై । 2024



త్యాగం, ధర్మనీతికి ప్రతీక మొహర్రం

ఇస్లాం సంవత్సరాది క్యాలెండర్‌లో మొదటి నెల మొహర్రం. ఈనెలలో మొదటి రెండు రోజుల ఉపవాస దీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఉంది.

- 8లో..



మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

పట్టణంలో ఇటీవల మోటారు సైకిళ్లు చోరీ చేసిన దొంగలను అరెస్టు చేయడంతో పాటు అతని నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

37 మండలాల్లో వర్షపాతం నమోదు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో నాలుగు రోజుల నుంచి చెదురు మదురు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 37 మండలాల్లో 380.4 మి.మీల మేర, జిల్లా సరాసరి 9.8 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అందులో హెచ్‌ఎంపాడులో 36.4 మి.మీలు, టంగుటూరు 24, బేస్తవారిపేట 19.6, కనిగిరి 17, వెలిగండ్ల 16.4, పొన్నలూరు 15.4, ఎస్ కొండ, కంభంలలో 15.2 మి.మీల చొప్పున, పీసీపల్లి 14.8, మార్కాపురం 12.6, కొమరోలు 12.4, పామూరు 12.2, మద్దిపాడు, మర్రిపూడిలలో 10.6 మి.మీల చొప్పున, తర్లుపాడులో 10.2, పొదిలి, కొనకనమిట్లలో 10.0 మి.మీల చొప్పున, కొండపిలో 9.4, దొనకొండ 9, తాళ్లూరు 8.2, సంతనూతలపాడు, రాచర్లలో 7.8 మి.మీల చొప్పున, ఒంగోలు, ఒంగోలు అర్బన్‌లలో 7.6, కొత్తపట్నంలో 6.8, యర్రగొండపాలెం, గిద్దలూరులలో 6, సీఎస్ పురం 5.2, చీమకుర్తిలో 4.6, త్రిపురాంతకం 4.4, నాగులుప్పలపాడు, కురిచేడు, అర్ధవీడులలో 4.2 మి.మీల చొప్పున, జరుగుమల్లి 4, పెద్దారవీడు 3.4, ముండ్లమూరు 2.6, దర్శి, పుల్లలచెరువులలో 2.4 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

జేవీవీ జాతీయ ఉపాధ్యక్షునిగా గయాజ్ బాషా



కనిగిరి రూరల్: జన విజ్ఞాన వేదిక జాతీయ కమిటీ ఉపాధ్యక్షునిగా కనిగిరికి చెందిన ఎస్‌కే గయాజ్ బాషా ఎన్నికయ్యారు. బెంగళూరులో నిర్వహించిన జన విజ్ఞాన వేదిక ఐదో జాతీయ మహాసభల్లో గయాజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గయాజ్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదికను అన్ని రాష్ట్రాల్లో విస్తరింపచేస్తామన్నారు. సైన్స్ ప్రచార సంస్థగా జన విజ్ఞాన వేదిక ఇప్పటికే ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగి ఉందని, మూఢ నమ్మకాల నిర్మూలన, విద్యార్థులకు విద్య, ఆరోగ్యంపై అనేక అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జగయాజ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

సూపర్ సిక్స్.. తొలి హామీ విస్మరామి

అధికారం కోసం అడ్డమైన హామీలిచ్చిన చంద్రబాబు.. పదవి రాగానే హామీలకు మంగళం పలుకుతున్నారు. జూన్ నెల నుంచి అమలు కావాల్సిన పథకాలకే ఇంకా విధివిధానాలు ప్రకటించలేదు. కూటమి ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్‌లోని మొదటి హామీ.. నిరుద్యోగ భృతి. కనీసం ఈ పథకం అమలుకు సంబంధించి మార్గదర్శకాలు ప్రకటించకుండానే.. దరఖాస్తులు చేయకుండానే.. లబ్ధిదారుల ఎంపిక జరగకుండానే తాజాగా ఈ పథకం అమలంటూ టీడీపీ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది. అమ్మకు వందనం అందరికీ అని చెప్పి.. ఒకరికేనంటూ జీఓ జారీ చేయడంతో తీవ్ర వ్యతిరేకత రావడంతో తూచ్ అంటూ నాలుక మడతెట్టేసారు. ఈ విధంగా నిరుద్యోగ భృతి పథకం అమలుకు ప్రస్తుతానికి మంగళం పలకనుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- నిరుద్యోగ భృతి.. అంతా భ్రాంతి
- విధివిధానాల్లేవు.. నిరుద్యోగుల జాబితా లేదు
- నిరుద్యోగుల డేటా లేకుండానే నిరుద్యోగుల కళ్లకు భృతి గంతలు
- జిల్లా వ్యాప్తంగా 6 లక్షల మందికిపైగా ఎదురుచూపులు
- ఇప్పటి దాకా నోరు విప్పని ముఖ్యమంత్రి చంద్రబాబు



నిరుద్యోగ భృతి ఇస్తామంటూ కూటమి మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో ఇచ్చిన ప్రకటన

ఒంగోలు టౌన్:

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఇప్పుడు గ్రామ సచివాలయాలు, నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులందరికీ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలన్నర దాటింది. యాభై రోజులు గడుస్తున్నప్పటికీ నిరుద్యోగ భృతి ఊసెత్తడంలేదు. అధికారులు మాత్రం మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. ఇంకా విధి విధానాలు కూడా ఖరారు కాలేదని చెబుతున్నారు. దీంతో నిరుద్యోగుల్లో నిరుత్సాహం నెలకొంది

లక్షల మందికి భృతి అందేనా.?

ఇంటికో ఉద్యోగం లేకపోతే ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి బలంగా హామీ ఇచ్చింది. ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోని ప్రతి కుటుంబానికి నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. 2011 జనాభా ప్రకారం జిల్లాలో 5.66 లక్షల గృహాలు ఉన్నాయి. ఈ పదమూడేళ్లలో మరో 3 లక్షల వరకు పెరిగి ఉంటాయి. ఈ లెక్కన చూస్తే జిల్లాలో కనీసం 6 లక్షల వరకు నిరుద్యోగులు ఉంటారని అంచనా. వీరికి నెలకు 3000 రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా అంటే.. లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి కల్పన కార్యాలయంలో 24 వేల మంది నమోదు

ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ నియామకాలు తగ్గిపోవడంతో ఎంప్లాయిమెంట్ చేసేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో జిల్లా ఉపాధి కార్యాలయంలో రిజిస్టర్ చేసుకున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. ఈ ఏడాది జూన్ వరకు గమనిస్తే కేవలం 24,177 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. వీరిలో 6,614 మంది మహిళలు, 7,608 మంది ఎస్సీలు, 1,621 మంది ఎస్టీలు, 6,939 మంది ఓబీసీలు, 5,433 మంది దివ్యాంగులు ఉన్నారు. నిజానికి ప్రతి ఏడాది ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునే వారి సంఖ్య జిల్లాలో వేలల్లో ఉంటుంది. డిగ్రీ, పీజీ, బీటెక్ లాంటి సాంకేతిక విద్య పూర్తి చేసుకునే వారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరితో పాటుగా డిప్లమాలు చేసిన వారిని కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, ప్రభుత్వం వద్ద నిరుద్యోగులకు సంబంధించి ఎలాంటి డేటా లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా స్కిల్ సెన్సస్ సర్వే చేస్తామని చెప్పింది.

ఈ సర్వే కూడా ఇంకా ప్రారంభం కాలేదు. ఒకవేళ నిరుద్యోగుల సంఖ్య ఏదైనా ప్రభుత్వం దగ్గర ఉండి ఉంటే మళ్లీ స్కిల్ సర్వే అవసరం ఏముంటుంది. ఈ లెక్కలు తేల్చకుండా నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ప్రభుత్వం చెప్పడం పట్ల ప్రజా సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

యువనేస్తంపై ఎన్నో అనుమానాలు...

ఎన్నికలకు మందు సూపర్ సిక్స్‌లో నిరుద్యోగ భృతి చేర్చిన చంద్రబాబు విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలిస్తానని, ఉద్యోగం వచ్చేవరకు ప్రతి ఒక్కరికీ నెలకు 3000 రూపాయల భృతి ఇస్తామని హామీలిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ పదవులు, ప్రమాణాలతో కాలం వెల్లబుచ్చుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో కూడా చంద్రబాబు ఇలాగే వ్యవహరించారు. బాబు వస్తే జాబు వస్తుందని, 2 వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు గుప్పించిన ఆయన.. ఎన్నికల తర్వాత దాని ఊసే ఎత్తలేదు. 2019 ఎన్నికలకు మందు మాత్రం హడావిడి చేశారు. అప్పుడు కూడా ఇదే పరిస్థితి. నిరుద్యోగులకు సంబంధించిన డేటా ఏమీ లేకుండానే నామ మాత్రంగా నిధులు కేటాయించినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. మంత్రులు, బ్యూరోక్రాట్లతో రోజుల తరబడి సమీక్షలు చేస్తున్న ముఖ్యమంత్రి ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి గురించి ఎలాంటి చర్చలు చేయలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లతో ఇలా...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి పథకాన్ని వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి వివరించేవారు. వారే దరఖాస్తులు పూర్తి చేసి తీసుకెళ్లి సచివాలయంలో ఇచ్చేవారు. పథకానికి ఎంపికైన తర్వాత కూడా సమాచారం ఇచ్చేవారు. నిజాయితీగా సేవలందించిన వలంటీర్ల మీద కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం.. వారిని ప్రభుత్వ పథకాల నుంచి పక్కన పెట్టేసింది. గాలిలో దీపం వెలిగించినట్లు కొత్త కొత్త పథకాలు అమలు చేస్తామంటోంది. దీంతో పథకాల అమలుపై ప్రజల్లో అపనమ్మకం నెలకొంది.

కొర్రీలు వేయకుండా అందరికీ ఇవ్వండి



ఎన్నికలకు ముందుగా నిరుద్యోగులకు ఆశలు పెట్టడం.. తర్వాత పట్టించుకోకపోవడం మామూలైంది. చదువుకున్న నిరుద్యోగులందరికీ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పారు. ఆ మేరకు అర్హులైన అందరికీ ఎటువంటి కొర్రీలు, వడపోతలు లేకుండా నిరుద్యోగ భృతి అందించాలి. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తే వయస్సు మీరకుండా ఉద్యోగం వస్తుందనే ఆశ అయినా ఉంటుంది.

– మీగడ రమేష్‌కుమార్‌రెడ్డి, పొదిలి

నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదు



నేను డిప్లమో పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగం కోసం వేచి చూస్తూ ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నా. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదు. వెంటనే స్పందించి నిరుద్యోగ భృతి అందిస్తే మేలు.

– షేక్ సుభాని, కొమరోలు

గతంలోలా మోసగించొద్దు



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ప్రభుత్వం కాలయాపన చేయడం వలన నిరుద్యోగులకు నష్టం. ఎలాంటి షరతులు పెట్టకుండా గ్రామాల్లో 45 ఏళ్లలోపు ఉన్న నిరుద్యోగులను గుర్తించి పథకాన్ని అందించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో మాదిరిగా నిరుద్యోగులను మోసం చేయకుండా ఇచ్చిన వాగ్దానం నెరవేర్చాలి.

– మంచికలపాటి సాల్మన్, నిరుద్యోగి, పొన్నలూరు

మమ్మల్ని పట్టించుకోవడం లేదు



నేను 2019లో డిగ్రీ పూర్తి చేశాను. నాకు ఉద్యోగం లేదు. 2024 ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే నిరుద్యోగ భృతి కల్పిస్తాను అని ప్రకటిస్తే ఓటేశాను. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చి నెలరోజులు కావస్తున్నా మమ్మల్ని పట్టించుకోవడం లేదు. మాకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– అత్యాల ఇస్సాకు, పీసీపల్లి

ఉద్యోగం.. లేదంటే భృతి ఇవ్వాలి



బీకాం కంప్యూటర్స్ డిగ్రీ పూర్తి చేశాను. నాకు ఎటువంటి ఉద్యోగం రాలేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటికి ఉద్యోగం, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఆశతో ఆయనకు ఓటు వేశాను. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా ఇంత వరకు ఆ ప్రస్తావన చేయలేదు. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. లేదంటే నిరుద్యోగ భృతి అయినా ఇస్తే ఉపయోగంగా ఉంటుంది.

– గొల్లదారి రామకృష్ణ, కురిచేడు

ప్రజాపక్షమై పోరాడతా

- రాజకీయాల నుంచి విరమించుకుందామనుకున్నా
- కానీ మీ చేష్టలే నన్ను మళ్లీ ఒంగోలులో ఉండేలా చేశాయి
- తెగిస్తే ఎవరూ ఆపలేరు...అవసరమైతే రెండు రోజులు జైల్లో పెడతారు అంతేగా
- పార్టీలకు అతీతంగా మేలుచేసిన వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం చేస్తారా
- మీడియా సమావేశంలో మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ధ్వజం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు: ''ఎన్నికలకు ముందు చివరిసారిగా పోటీ చేసి రాజకీయాల నుంచి తప్పుకోవాలనుకున్నా. కానీ నేడు జరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా ప్రజల కోసం, పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం తిరిగి ఒంగోలులోనే ఉండాలని నిర్ణయించుకున్నా..ప్రజా పక్షమై పోరాడతా'' అని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలుకు చేరుకున్న ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులతోపాటు అభిమానులు భారీగా రైల్వేస్టేషన్ వద్ద నుంచి స్థానిక లాయరుపేటలోని బాలినేని నివాసం వరకు ర్యాలీగా స్వాగతం పలికారు. అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడారు.

భూకబ్జాలపై విచారణ చేయించి నిగ్గుతేల్చాలి:
''నాపై, నా కుమారునిపై అనేక ఆరోపణలు చేయించారు. అవన్నీ నిగ్గు తేల్చాలని కోరుతున్నా. ఎటువంటి అవినీతి లేకున్నా ఇష్టం వచ్చినట్లు ఆరోపించడం, ఇంకా మా బావమరిది విల్లా వద్దకు కొంతమందిని పంపించి దౌర్జన్యం చేయించాలని చూడడం ఏమిటి...చూస్తూ ఊరుకుంటామనుకున్నారా...చేతనైతే అధికారికంగా నోటీసు ఇచ్చి నిరూపించాలి. రాజుపాలెంలో మీకున్న రొయ్యల చెరువుల్లో ఎన్ని ఎకరాలు డీకే ఉందో బయటకు చెబుతారా.. నేను అధికారంలో ఉన్నప్పుడు ఎన్నడూ ఎవరి భూముల జోలికి వెళ్లలేదు. పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి భూకబ్జాకు నేను సహకరించానని ఆరోపించారు. నేను ఆయనకు అండగా ఉంటే ఆయన మీ పార్టీలోకి ఎందుకు వస్తాడు... నేను సహకరించలేదు కనుకే మీ పార్టీలోకి వచ్చాడు. దమ్ముంటే నాపై వచ్చిన ఆరోపణలపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు నిజం నిగ్గు తేల్చి నా క్యారెక్టర్ ఏంటో ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నా.

దాడులు చేయించడం నీచ సంస్కృతి:
1999 నుంచి నేను ఎమ్మెల్యేగా ఉన్నా. ఏనాడూ ఎవరి జోలికి వెళ్లలేదు. 2019 ఎన్నికల సమయంలో కమ్మపాలెం వద్ద మమ్మల్ని అడ్డుకుని తీవ్రంగా టీడీపీ వాళ్లు అవమానించినా ఎన్నికల అనంతరం వారిమీద చిన్న కేసు కూడా పెట్టలేదు. కానీ నేడు మురళిపై విలేకరుల సమావేశం నిర్వహించారని దాడి చేయడం దారుణం. మరి మేము అధికారంలో ఉన్నప్పుడు మీ పార్టీ నాయకులు కూడా చాలా ప్రెస్‌మీట్లు పెట్టారు.. మేము కూడా దాడులు చేసి ఉంటే పరిస్థితి ఏమిటి? అధికారం ఇచ్చింది మంచి చేయడానికి. ఒంగోలు నగరానికి తాగునీరు ఇచ్చేందుకు రూ.339 కోట్లతో చేపట్టిన పథకానికి ఇప్పటికే టెండర్లు కూడా పూర్తయ్యాయి. చేతనైతే దానిని పూర్తిచేసి చూపించాలి. తెగిస్తే మమ్మల్ని ఎవరూ ఆపలేరు. మా వాళ్లు సిద్ధంగానే ఉన్నారు. మహా అయితే రెండు రోజులు జైలుకు మాత్రమే పంపగలరు. నాయకులు, కార్యకర్తలకు హాని జరుగుతుంటే చూస్తూ ఊరుకోను. పార్టీలకు అతీతంగా మంచి చేసిన వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం నీచ సంస్కృతి. మీతాత దామచర్ల ఆంజనేయులు విగ్రహం పెట్టేందుకు కలెక్టర్ అంగీకరించకపోతే నేను మాట్లాడి పెట్టుకోవడానికి పర్మిషన్ ఇప్పించాను.

పారిపోయాడని ఫ్లెక్సీలు వేయిస్తారా...
రాజకీయాలకు ఇక దూరంగా ఉండాలనే ఉద్దేశంతోనే నేను కౌంటింగ్ రోజు సాయంత్రమే హైదరాబాదు వెళ్లాను. కానీ నేను పారిపోయానంటూ ఒక ఛోటా నాయకుడి చేత ఫ్లెక్సీలు వేయించడం, ఇంకో జనసేన నాయకుడితో నేను జనసేనలోకి వస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేయించడం వంటి చీప్ ట్రిక్స్ సరికాదు. నేను మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకున్నానని గుర్తుంచుకోవాలి. నాకు ఎన్నికల సమయంలో కొంత అప్పు అయింది. బాకీదారులకు వాటిని చెల్లించాల్సి ఉన్న దృష్ట్యా ఒకటి రెండు నెలలు హైదరాబాద్‌లో ఉండాల్సి ఉంటుంది. అప్పులు ఎగ్గొట్టే తత్వం నాది కాదు. ప్రతి పైసా తీరుస్తాను. కానీ కార్యకర్తలపై దాడులు చేయడం, వారిని మానసికంగా హింసించాలని చూస్తుండడాన్ని సహించలేకే రాజకీయాల నుంచి విరమించాలనుకున్న నేను ఒంగోలులోనే ఉండాలని నిర్ణయించుకున్నా. నేను అవినీతి చేయకపోయినా దుష్ప్రచారం చేశారు. కానీ నేను మాత్రం జరిగే ప్రతి అవినీతిపై ప్రజాపక్షంగా పోరాడతాను.

ఉద్యోగులు, వ్యాపారులకు బెదిరింపులు అప్పుడే ప్రారంభమయ్యాయి:
నేను 1999 నుంచి ఎమ్మెల్యేగా ఉన్నా ఏనాడూ ఏ అపార్టుమెంట్ కట్టుకునే వ్యక్తినీ, లే అవుట్‌లు వేసుకునేవారిని బెదిరించిన దాఖలాలు లేవు. కానీ నేడు 150 మందికి నోటీసులు ఇప్పించారు. తద్వారా వారికి ఎలాంటి హెచ్చరికలు అందుతున్నాయో స్పష్టమవుతుంది. అధికారులకు సైతం బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెబుతున్నారు. తమపై జరిగే దాడులపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేసినా పోలీసులు సరిగా కేసులు పెట్టకపోవడం, పట్టించుకోకపోతే ఊరుకోం. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం. నగరపాలక సంస్థకు సంబంధించి కార్పొరేటర్లు ఎవరు పార్టీని వీడే పరిస్థితి లేదు'' అని మీడియా సమావేశంలో బాలినేని ప్రకటించారు. సమావేశంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనా కుమారి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, గొర్రెపాటి శ్రీనివాసరావుతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


రైల్వే స్టేషన్‌లో బాలినేని శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్ తదితరులు

త్యాగం, ధర్మనీతికి ప్రతీక.. మొహర్రం

- ఇస్లాం మొదటి నెల మొహర్రంతో ప్రారంభం
- రెండు రోజుల ఉపవాస దీక్షలకు ఎంతో విశిష్టత


మొహర్రం వేడుకలు (ఫైల్)

కనిగిరి రూరల్: ఇస్లాం సంవత్సరాది క్యాలెండర్‌లో మొదటి నెల మొహర్రం. ఈ నెలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. మొహర్రం నెలలో ఇస్లాంకు సంబంధించి కొన్ని మంచి కార్యాలు, మరికొన్ని విషాద ఘటనలు కూడా చోటుచేసుకున్నట్లు ముస్లిం పెద్దలు చెబుతారు. ప్రధానంగా ఈ నెలలో మహ్మద్ ప్రవక్త మనువళ్లు అయిన ఇమామే హసేన్, హుస్సేన్ వంశీకులు (వారి పరివారం) దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సంరక్షణార్థం, ధర్మ సంస్థాపన, సత్యం, న్యాయం, విలువలు, హక్కుల కోసం చేసిన ధర్మనీతి యుద్ధంలో అమరవీరులవుతారు. దీంతో వారి త్యాగనిరతిని, ధర్మనీతిని కీర్తిస్తారు.

రెండు రోజుల ఉపవాసంకు ఎంతో ప్రాముఖ్యత...

మొహర్రం నెలలో రెండు రోజుల ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇమామే హసన్ వంశీకులు మృతవీరులైన దినాల్లోని 9, 10, లేదా, 10, 11 రోజుల్లో (నఫీల్ రోజాలు) ఉపవాస దీక్షలను ముస్లింలు ఆచరిస్తారు. ఈ ఉపవాస దీక్షలు ఆచరించడం వల్ల తెలిసీతెలియక చేసిన ఏడాది పాటు పాపాలు, గుణాలను అల్లాహ్ క్షమింపజేస్తారని ముస్లింల నమ్మకం. దీంతో ఎక్కువ మంది ముస్లింలు కుటుంబ సమేతంగా రోజా ఉపవాస దీక్షలు పాటిస్తారు.

ధర్మనీతికి ప్రతీక...

రాజరిక పాలనలో దాయాదులైన హజరత్ అలి, మావియాలు చెరొక రాజ్యాధికారం చేస్తుంటారు. హజరత్ అలికి ఇద్దరు కుమారులు ఇమామే హసన్, ఇమామే హుస్సేన్. మావియాకి ఒక కుమారుడు యజీద్. ఈ క్రమంలో హజరత్ అలి చనిపోతారు. అలీ కుమారులు చిన్నవాళ్లు కావడంతో సుభిక్ష పాలన చేస్తున్న మావియాకు రాజ్యాధికారాన్ని అప్పగించేందుకు హసన్, హుస్సేన్ కూడా సమ్మతిస్తారు. ఈ నేపథ్యంలో అలీ రాజ్యాన్ని కూడా దాయాది అయిన మావియా పరిపాలిస్తాడు. కొన్నేళ్ల తర్వాత హజరత్ మావియా కాలాతీతులవుతారు. దీంతో మావియా కుమారుడు యజీద్ రాజ్యాధికారాన్ని చేపట్టేందుకు పట్టాభిషితుడవుతాడు. అయితే అలీ పాలించిన రాజ్యాన్ని కూడా తనకే అప్పగిస్తూ.. సమ్మతి తెలపాలని వరుసకు అన్నదమ్ములైన ఇమామే హసన్, హుస్సేన్‌లను యజీద్ కోరుతాడు. అందుకు హసన్, హుస్సేన్‌లు నిరాకరిస్తారు. ముందు తన పరిపాలన దక్షతను నిరూపించుకోవాలని చెప్తారు. దీంతో అప్పటి నుంచి యజీద్ మనసులో కుట్రను పెంచుకుంటాడు. మంచి తనంగా ఉంటూనే ఇమామే హసన్‌పై విషప్రయోగం చేయిస్తాడు. దీంతో అలీ కుమారుల్లో పెద్దవాడైన ఇమామే హసన్ మరణిస్తాడు. ఆ తర్వాత కొంత కాలానికి అసలు విషయం ఇమామే హుస్సేన్‌కు తెలుస్తుంది. అయినప్పటికీ శాంతి, ధర్మం కోసం మౌనం దాల్చుతాడు.

ఇస్లాం వ్యాప్తి కోసం పవిత్ర ప్రార్థనలు చేసుకుంటూ ఇమామే హుస్సేన్ దైవకార్యంలో కాలం గడుపుతుంటారు. ఈ క్రమంలో యజీద్ ఆకృత్యాలు రాజ్యంలో పెరిగిపోతాయి. మద్యానికి బానిసై దైవాన్ని ధిక్కరిస్తూ రాక్షస పాలనకు నాంది పలుకుతాడు. దీంతో రెండు రాజ్యాలకు చెందిన వారు విసిగివేసారి ఇమామే హుస్సేన్‌ను రాజ్యాధికారం చేపట్టాలని అభ్యర్థిస్తారు. ప్రతి నిత్యం వందల కొలది ఉత్తరాలను హుస్సేన్‌కు పంపుతుంటారు. రాజ్యంలోని ప్రజలు, వారు పడే వేదనను అత్యంత దీనంగా ఉత్తరాల్లో వెల్లడిస్తారు. తామంతా మీకు మద్దతుగా నిలబడతామని యజీద్‌పై యుద్ధం ప్రకటించి రాజ్యాధికారం చేపట్టాలని రహస్య ఉత్తరాల ద్వారా దీనంగా వేడుకుంటారు. దీంతో ఇమామే హుస్సేన్ చలించిపోతాడు. ఈ క్రమంలో ఇమామే హుస్సేన్ యుద్ధానికి సమాయత్తం అవుతుండగా ముందుగానే గుర్తించిన యజీద్ యుద్ధాన్ని ప్రకటిస్తాడు. హుస్సేన్ వంశీయులు యుద్ధానికి వెళ్లడానికి నిరాకరిస్తారు. అయినా హుస్సేన్ వినకుండా ప్రజా ప్రయోజనార్థం, ధర్మనీతి రాజ్యస్థాపన కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ధర్మం, న్యాయం కోసం సమాజంలో ప్రబలిన అన్ని రకాల చెడులను రూపుమాపేందుకు తాను యుద్ధానికి వెళ్లితీరుతానని నిర్ణయం తీసుకుంటాడు. ఈ క్రమంలో మొహర్రం నెలలో హుస్సేన్ కుటుంబీకులు వందలాది మంది యుద్ధానికి బయలుదేరుతారు.

వీరమరణంలోని సందేశం ఇది...

హజ్రత్ ఇమామే హుస్సేన్, ఆయన వంశీకుల వీరమరణం సమాజానికి గొప్ప సందేశాన్ని ఇచ్చినట్లు ముస్లిం పెద్దలు చెబుతారు. సమాజంలో దుర్మార్గం, ఉన్మాదం ప్రబలినప్పుడు, మానవ హక్కులు, విలువలు హననం అవుతున్నప్పుడు, హరిస్తున్నప్పుడు, ప్రజాస్వామ్య పరిరక్షణకు, ధర్మనీతి స్థాపనకు, ధర్మ స్థాపనకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, శక్తివంచన లేకుండా పోరాటం చేయాలన్నదే ఇమామే హుస్సేన్ వంశీకుల వీరమరణంలో దాగి ఉన్న ఉన్నత సందేశం.

కర్ బలాలో...

మదీనా నుంచి ఇమామే హుస్సేన్ వంశీకులు యుద్ధానికి బయలు దేరిన తర్వాత కర్‌బలా మైదానం చేరుకునే సమయంలో ఒక్కసారిగా యజీద్ భారీ సైన్యంతో చుట్టుముడతాడు. హుస్సేన్‌కు సహకరిస్తామని చెప్పినవాళ్లు కొందరు ప్రాణభయంతో వెనుకంజ వేస్తారు. మరికొందరు యుద్ధ మైదానంలో మద్దతు పలికి అశువులుబాస్తారు. మూడు రోజులపాటు నిరంతర భీకర యుద్ధం సాగుతుంది. హుస్సేన్ సైన్యంకు కనీసం మంచినీళ్లు కూడా లేకుండా చేసి చెరువుల్లో, కుంటల్లో విషం కలిపి చంపుతారు. ఈ క్రమంలో హుస్సేన్ కర్‌బలా మైదానంలో ఒక రోజు నమాజు చేస్తుండగా యజీద్, అతని సైన్యం దొంగచాటుగా (సిజ్దా సమయంలో) తలను ఛేదిస్తాడు. ఈ యుద్ధంలో హుస్సేన్ వంశీకులు వీరమరణం పొందుతారు. అయితే కొద్ది రోజులకే యజీద్ తీవ్ర పశ్చాత్తాపంతో తల్లడిల్లుతాడు. దైవ ప్రవక్త మనవళ్లను చంపి తాను ఘోర తప్పిదం చేసినట్లు భావిస్తాడు. శక్తి హీనుడిగా మారి తీవ్ర మనోవేదనకు లోనవుతాడు. అల్లాహ్ వద్ద శిరస్సు వంచి క్షమాపణ కోరతాడు. తన తప్పును మన్నించాలని కడుదీనంగా యజీద్ వేడుకుంటాడు. ఈ క్రమంలో ఇమామ్ హసన్, హుస్సేన్ వంశీకులకు లోక కళ్యాణార్థం చూపిన త్యాగశైలిని, ధర్మనీతిని స్మరిస్తూ మొహర్రం నిర్వహిస్తున్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు


స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

- ఐదు మోటారు సైకిళ్లు స్వాధీనం

పొదిలి: పట్టణంలో ఇటీవల మోటారు సైకిళ్లు చోరీ చేసిన దొంగను అరెస్ట్ చేయడంతో పాటు అతని వద్ద నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కోటయ్యతో కలిసి ఆ వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన సయ్యద్ ఖాదర్‌బాషా చెడు వ్యసనాలకు లోనై చోరీలకు పాల్పడ్డాడు. పొదిలిలో నాలుగు బైకులు, దర్శిలో ఒక బైకు చోరీ చేశాడు. జన సంచారం లేని ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉంచిన బైకులను అతని వద్ద ఉన్న నకిలీ తాళంతో స్టార్ట్ చేసి దొంగిలిస్తాడు. బైకుల చోరీకి సంబంధించి నమోదైన కేసులు ఛేదించేందుకు పోలీసు అధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ బృందం చాకచక్యంగా విచారణ చేపట్టి నిందితుడు ఖాదర్‌బాషాను అరెస్ట్ చేసి విచారించింది. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మూసివేసిన విజేత స్కూలు వద్ద చిల్లచెట్లలో నిందితుడు దాచి ఉంచిన బైకులను కూడా స్వాధీనం చేసుకుంది. హెచ్‌ఎఫ్ డీలక్స్ రెండు బైకులు, హీరో ఫ్యాషన్ ప్రో రెండు బైకులు, దర్శికి చెందిన గ్లామర్ బైకును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.38 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. వాహనదారులు బైకులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, పార్కింగ్ చేసిన సమయంలో హ్యాండిల్ లాక్‌లు వేయాలని సూచించారు. పాత బైకులకు ఎప్పటికప్పుడు లాక్ సిస్టం మార్పులు చేసుకోవడం ద్వారా చోరీకి గురికాకుండా కాపాడుకోవచ్చని సూచించారు.

పాత ఉపాధ్యాయులనే కొనసాగించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌నాయక్

- పెద్దదోర్నాల ఏకలవ్య పాఠశాల విద్యార్థినుల ఆందోళన

పెద్దదోర్నాల: తమ పాఠశాలలో పాత ఉపాధ్యాయులనే కొనసాగించాలంటూ పెద్దదోర్నాల మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థినులు సోమవారం ఆందోళన నిర్వహించారు. దీంతో పాఠశాలలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎంఈఓ మస్తాన్‌నాయక్ హుటాహుటిన పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. విద్యార్థినుల కథనం మేరకు గతంలో స్థానిక ఉపాధ్యాయులతోనే పాఠశాలలో విద్యాబోధన జరిగేది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కొత్తగా దక్షిణాది నుంచి దాదాపు 21 మంది నూతన ఉపాధ్యాయులు బదిలీపై వచ్చి పాఠశాలలో విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు బోధించిన భాష తమకు అర్థం కావడం లేదని విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్ విద్యార్థులతో మాట్లాడుతూ బేసిక్‌గా హిందీ రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు కాబట్టి కొద్దిగా అలవాటు అయ్యేంత వరకు హిందీ పదాలు దొర్లుతాయని తెలిపారు. కొద్దిరోజులు పోయాక వాళ్లు కూడా తెలుగు భాష మాట్లాడే స్థాయికి వస్తారని నచ్చజెప్పడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

15 సెల్‌ఫోన్ల రికవరీ


యజమానికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై కోటయ్య

పొదిలి: చోరీకి గురైన 15 సెల్‌ఫోన్లను రికవరీ చేసి యజమానులకు వాటిని అప్పగించినట్లు పొదిలి ఎస్సై కోటయ్య తెలిపారు. దర్శి డీఎస్పీ, పొదిలి సీఐ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ల రికవరీల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ బృందం ఆధ్వర్యంలో సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు వివరించారు.

13 మంది హిజ్రాలకు గుర్తింపు కార్డుల పంపిణీ


హిజ్రాలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: 13 మంది హిజ్రాలకు గుర్తింపు కార్డులు, వయోవృద్ధుడు లక్ష్మీనరసింహకు శ్రవణ యంత్రంను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన మీ కోసం కార్యక్రమంలో పంపిణీ చేశారు. గతంలో 13 మంది హిజ్రాలు గుర్తింపు కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వారి అర్హతలు పరిశీలించిన అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా దరఖాస్తుదారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధునికి శ్రవణ యంత్రం అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మేనిఫెస్టో అమలు చేయాలి

- కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్



దద్దాల నారాయణ యాదవ్


కనిగిరి రూరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ×తల్లికి వందనం¤ అని మీ ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పి ప్రచారం చేశారన్నారు. తల్లికి వందనం అమలుపై ఇటీవల జీఓ నంబర్ 29 జారీ చేసిన ప్రభుత్వం.. అందులో ప్రతి పిల్లాడికి అని కాకుండా, ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామంటూ ప్రకటించిందన్నారు. అసలు పథకాన్ని ఎలా అమలు చేయాలనుకుంటున్నారో వివరంగా చెప్పాలన్నారు. దీనిపై ప్రభుత్వాన్ని వైఎస్సార్ సీపీ ఎన్నిసార్లు ప్రశ్నించినా ఎలాంటి స్పందనా లేదన్నారు. ఎవరూ నోరు విప్పడం లేదని విమర్శించారు. చీటికీ మాటికీ ట్వీట్లతో విరుచుకుపడే నారా లోకేష్‌గానీ, ఎన్నికల ముందు ప్రచారంలో తల్లికి వందనం పథకం గురించి గొప్పగా చెప్పిన జనసేన అధినేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌గానీ.. ఒక్కమాట మాట్లాడటం లేదన్నారు. ఎటూ సమాధానం చెప్పలేక విద్యా శాఖ నుంచి ఒక నోట్ విడుదల చేసి తల్లికి వందనం పథకానికి కొత్త మార్గదర్శకాలు జారీ చేస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు పథకంలో ఆధార్ లింక్ కోసమే జీఓ ఇచ్చామని అందులో పేర్కొన్నారని తెలిపారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే జీఓను మార్చుకుని చెప్పినమాట ప్రకారం ఒక ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇవ్వాలని దద్దాల డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటు...

సాక్షాత్తూ సుప్రీంకోర్టు తప్పుపట్టినా, అప్పటి ఎంపీ రఘురామ ఫిర్యాదులో వాస్తవం లేదని తేల్చిచెప్పినా, ఆ కేసును అప్పుడే కొట్టేసినా.. మళ్లీ కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా మూడేళ్ల తర్వాత సీనియర్ ఐపీఎస్‌లతో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, డాక్టర్‌పై కేసు నమోదు చేయడం సిగ్గుచేటని దద్దాల నారాయణయాదవ్ అన్నారు. ఎవరి సంతోషం కోసమో.. ఎవరిని ఇబ్బంది పెట్టడం కోసమో.. అన్నట్లుగా మూడేళ్ల తర్వాత కేసు నమోదు చేశారని ఘాటుగా విమర్శించారు. కేవలం దురుద్దేశం, రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారన్నారు. పిటీషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చినా, మూడేళ్ల తర్వాత మళ్లీ రఘురామ ఫిర్యాదు చేస్తే.. అందులో ప్రస్తావించిన వారందరిపైనా ఇప్పుడు కేసు నమోదు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అసలు ఈ కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలా నిందితుడు అవుతారని ప్రశ్నించారు. ఇంతకన్నా తప్పుడు కేసు మరొకటి ఉండదని, పాలించే వ్యక్తి మారితే రాజ్యాధికారం కూడా మారుతుందా.? ఆ వ్యక్తికి వంత పాడుతుందా.? అసలు చట్టం, న్యాయం, ప్రాథమిక సూత్రాలు ఏంటి.? అని దద్దాల నిలదీశారు. గతంలో ఈ కేసులో సుప్రీంకోర్టు ఏం చెప్పింది.. 77 రోజుల తర్వాత సాక్షులను విచారించడమే సరికాదని తేల్చి చెప్పిందని తెలిపారు. మరి అలాంటప్పుడు మూడేళ్ల తర్వాత విచారిస్తే ఏం జరుగుతుందన్నారు. ఈ కేసులో మరో ట్విస్ట్ ఏమిటంటే.. రఘురామ ఫిర్యాదు మీద న్యాయసలహా తీసుకున్నామని పోలీసులు చెబుతున్నారన్నారు. రఘురామ గత నెల 11న ఈ–మెయిల్ ద్వారా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తే.. అంతకు ఒక రోజు ముందే.. అంటే జూన్ 10వ తేదీనే పోలీసులు లీగల్ ఒపీనియన్‌కు ఎలా రాశారన్నారు. అంటే రఘురామ ఫిర్యాదు చేస్తారని పోలీసులు ముందుగానే కలగన్నారా..? అని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పగలరా.? అని దద్దలా నారాయణ యాదవ్ ప్రశ్నించారు.

రేపు పాలంక వీరభద్రస్వామి తిరునాళ్ల


పాలంక వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్లు


పాలంక వీరభద్రస్వామి క్షేత్రం

యర్రగొండపాలెం: దట్టమైన నల్లమల అడవిలో కృష్ణానది ఒడ్డున వెలసిన పాలంక వీరభద్రస్వామి తిరునాళ్లను ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. స్వామివారి కరుణకోసం వేలాది మంది భక్తులు కాలినడకన, ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లనున్నారు. ప్రకాశం జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు, కర్నూలు, నంద్యాల, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు పాలంక చేరుకుంటారు.

గత వైభవానికి ప్రతీక.. పాలంక క్షేత్రం...

గత వైభవానికి ప్రతీకగా నిలిచిన పాలంక క్షేత్రం యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గిరిజనగూడెం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. యర్రగొండపాలెం నుంచి పాలంక చేరుకునేందుకు 60 కిలోమీటర్ల యాత్ర సాగించాలి. దట్టమైన నల్లమల అడవుల్లో ఆకాశాన్ని అంటే కొండల్లో నుంచి సాగే ఈ భక్తిరస యాత్ర ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. విజయనగర సామ్రాజ్యాధీశుడైన శ్రీకృష్ణదేవరాయలు పాలన వైభవానికి చెరిగిపోని జ్ఞాపకంగా ఈ పాలంక క్షేత్రం నిలుస్తోంది.

భక్తుల పాలిట కొంగు బంగారం...

సంతాన ప్రాప్తి కోసం భక్తులు అధిక సంఖ్యలో పాలంక క్షేత్రాన్ని దర్శిస్తుంటారు. ఇక్కడి పెద్ద కొండచరియపై నుంచి పంచలింగాలపై జాలువారే నీటి బిందువుల కోసం సంతానం లేని దంపతులు దోసిళ్లు పడతారు. అలా దోసిళ్లపై నీటి బిందువులు పడిన దంపతులకు సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

ప్రకృతి సోయగం...

పచ్చటి వృక్షాలతో దట్టమైన అడవి, పెద్ద కొండ చరియపై నుంచి జాలువారే జలపాతం, ప్రకృతి రమణీయత మైమరపించే అందాలకు ఆలవాలంగా నిలుస్తుంది పాలంక క్షేత్రం. ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన ఆదిశేషుని ఆకారం వంటి కొండ చరియ కింద మూలవిరాట్ పాలంకేశ్వరుడితో పాటు వీరభద్రుడు, గణపతి, పంచముఖ బ్రహ్మ, పోతురాజుల ఆలయాలు, పది అడుగుల ఎత్తున్న నాగమయ్య పుట్ట ఉన్నాయి.

పొగాకు బేళ్ల అపహరణ

టంగుటూరు: ఓ గోడౌన్లో నిల్వ ఉంచిన పొగాకు చెక్కులను గుర్తు తెలియన వ్యక్తులు అపహరించిన సంఘటన మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బెజవాడ శివయ్యకు మర్లపాడు రోడ్డులో షెడ్డు ఉంది. తాను పండించిన పొగాకు బేళ్లను బోర్డులో విక్రయించుకునేందుకు షెడ్డులో 50 చెక్కులు, 2 సూర చెక్కులు నిల్వ ఉంచారు. వాటిలో మేలిమి రకానికి చెందిన ఏడు చెక్కులను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అటుగా పోతున్న శివయ్య షెడ్డు తలుపులు తీసి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని రూ.4 లక్షల విలువైన 7 చెక్కులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి సమీపంలోని పెట్రోల్ బంక్‌లో ఉన్న సీసీ కెమేరాల పుటేజీ పరిశీలించారు.


పొగాకు చెక్కులు అపహరణకు గురైన షెడ్డు